ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 21 సెప్టెంబరు 2024

వచ్చే నెల ఐదు నుంచి విశాఖ, అరకు మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 20: పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అక్టోబరు 5 నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నం-అరకు మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నామని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08525 నంబరు గల రైలు వచ్చే నెల ఐదు నుంచి ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు విశాఖలో బయలుదేరి 11.30 గంటలకు అరకులోయ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08526 నంబరు గల రైలు మధ్యాహ్నం 2.00 గంటలకు అరకులో బయలుదేరి సాయంత్రం 6.00 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ రైళ్లు కొత్తవలస, శృంగవరపుకోట, బొర్రాగుహలు మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

పోస్టింగ్‌ల కోసం పైరవీలు

బదిలీలకు ఉద్యోగుల యత్నాలు

- సిఫారసు లేఖలతో అధికారులపై ఒత్తిళ్లు
- కోరుకున్న చోట దక్కించుకునేందుకు పావులు
- మైదాన ప్రాంతాల్లో కొనసాగేందుకు ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు
- నేడు బదిలీ దరఖాస్తులకు చివరి రోజు



అనకాపల్లి కలెక్టరేట్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఉద్యోగుల బదిలీలకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో కావలసిన స్థానాల కోసం పైరవీలు జోరందుకున్నాయి. విద్య, వైద్య, వ్యవసాయ అనుబంధ శాఖల్లో మినహా మిగిలిన 15 ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన జరుగుతున్న బదిలీల కోసం ఆయా శాఖల హెచ్‌ఓడీలకు ఉద్యోగులు దరఖాస్తులు చేస్తున్నారు. ఇప్పటికే అందిన దరఖాస్తులను హెచ్‌ఓడీలు పరిశీలిస్తున్నారు. వాస్తవానికి ఈనెల 15వ తేదీతోనే ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు ముగిసినా విజయవాడ వరదల కారణంగా ఈనెల 21వ తేదీ వరకు అవకాశం కల్పించారు.

సుదీర్ఘ కాలం తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు అనుమతించింది. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, జిల్లాపరిషత్, డీఆర్‌డీఏ, డ్వామా, ఇంజనీరింగ్, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు బదిలీలు జరగనున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ శాఖల్లో బదిలీల కోసం 7 వేల మంది ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. వీరిలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు వెయ్యి మందిలోపే ఉంటారని చెబుతున్నారు. మిగిలిన వారంతా రిక్వస్ట్ ట్రాన్స్‌ఫర్స్, స్పౌస్ కోటా కింద బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు సుమారు మూడు వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. కొందరు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని మాన్యువల్‌గా స్థానిక ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను హెచ్‌ఓడీలకు అందజేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో నేతలతో అంటకాగిన పలువురు మండల స్థాయి ఉద్యోగులు కూటమి ప్రభుత్వంలోనూ కావలసిన చోట పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, ల్యాండ్ అండ్ సర్వే విభాగాల్లో ఉద్యోగులు ప్రస్తుత ప్రజాప్రతినిధుల లేఖలతో అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్టు సమాచారం. కొందరు ఉద్యోగులు బదిలీల్లో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేసినట్టు తెలిసింది. రెవెన్యూ శాఖలో భూపరిపాలన విభాగానికి చెందిన ల్యాండ్స్, సర్వే శాఖలో గ్రామ సర్వేయర్లు, మండల సర్వేయర్లు, డిప్యూటీ మండల సర్వేయర్లు 480 మంది వరకు ఉన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూ రికార్డుల విషయంలో వీరి పాత్ర ఎంతో కీలకం కావడంతో కూటమి ప్రభుత్వంలో కొందరు ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఉండే మండల సర్వేయర్లకు బదిలీల కోసం సిఫారసు లేఖలు ఇచ్చినట్టు సమాచారం. వాస్తవానికి జీవో ప్రకారం ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు మాత్రమే బదిలీలు తప్పనిసరి చేశారు. ఏఎస్ఆర్ జిల్లాల్లో వీరు గతంలో పనిచేయకపోతే ఏజెన్సీకి బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ అనకాపల్లి జిల్లాలో సర్వే, ల్యాండ్స్ విభాగంలో పలువురు ఐదేళ్లు పూర్తి చేసుకున్న సర్వేయర్లు ఏజెన్సీకి వెళ్లకుండా మళ్లీ మైదాన ప్రాంతంలోనే పోస్టింగ్‌ల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మండల సర్వేయర్లు కూడా రెండేళ్లు సర్వీసు పూర్తయితే రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్‌కు అవకాశం ఉండడంతో ... మిగతా 8వ పేజీలో

అనుబంధ ఆలయాలకు

అదే నెయ్యి

టీటీడీ పరిధిలో 64 ఆలయాల్లో వాడకం

- కొడియా, చక్కెర పొంగలి తయారీ
- ధూప, దీప, నైవేద్యాలకు వినియోగం
- ఆందోళనలో వెంకన్న భక్తులు



నక్కపల్లి, సెప్టెంబరు 20:

లడ్డూ, ప్రసాదాల తయారీలో తిరుమల తిరుపతి దేవస్థానం కల్తీ నెయ్యి వినియోగిస్తున్నట్టు ధ్రువీకరణ కావడంతో అనుబంధ ఆలయాల్లోను కలకలం రేగింది. టీటీడీ వినియోగించే నెయ్యి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 64 అనుబంధ ఆలయాలకు సరఫరా చేస్తుంది. ఈ నెయ్యితోనే ఆలయాల్లో కొడియా, చక్కెర పొంగలి తయారు చేస్తారు. అంతేకాకుండా ధూప, దీప, నైవేద్యాలు, ఇతర కైంకర్యాలకు వినియోగిస్తారు. గత కొన్ని నెలలుగా టీటీడీలో కల్తీ నెయ్యి వినియోగిస్తున్నట్టు పరీక్షల్లో వెల్లడి కావడంతో మండలంలోని ఉపమాక ఆలయ అర్చకులు కలత చెందారు. టీటీడీ ఆధీనంలోని ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలు, ఇతర కైంకర్యాలకు తిరుమల నుంచే సరుకులు వస్తాయి. టీటీడీ భాషలో ఈ సరుకులను దిట్టం అని పిలుస్తారు. నెలకు సరిపడే దిట్టాన్ని అనుబంధ ఆలయాలకు టీటీడీ పంపుతుంది. అయితే టీటీడీ లడ్డూ ప్రసాదాల తయారీకి జంతువులకు సంబంధించి కొవ్వు పదార్థాలతో తయారు చేసిన నెయ్యిని వినియోగిస్తున్నారన్న సమాచారం పెను సంచలనం కలిగించింది. ఈ నెయ్యి లడ్డూ ప్రసాదాలకే కాకుండా అనేక కైంకర్యాలకు వాడతారు. ఆలయాల్లో దీపారాధన, స్వామివారికి నైవేద్యాలు పెట్టే కొడియా పొంగలి, చక్కెర పొంగలి వంటి ప్రసాదాలకు కూడా టీటీడీ నుంచి వచ్చిన నెయ్యినే అనుబంధ ఆలయాల్లో కూడా వాడతారు. ఇప్పుడు ఈ నెయ్యి ఆలయ, ఆచార, వ్యవహారాలకు, ఆగమానికి విరుద్ధంగా వాడిన అర్చకులు, ప్రసాదాలు స్వీకరించిన భక్తులు కలత చెందుతున్నారు. టీటీడీ అనుబంధ ఆలయాలను కూడా సంప్రోక్షన చేయాల్సిన అవసరం వుందని పలువురు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

సందడిగా ఇది మంచి ప్రభుత్వం

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, నాయకులు



నక్కపల్లిలో కేక్ కట్ చేస్తున్న హోం మంత్రి అనిత



అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం బ్రోచర్‌ను అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

- ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన
- వంద రోజుల ప్రగతిపై ప్రచారం

అనకాపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తవడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 26వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుంది. తొలిరోజు ప్రారంభోత్సవానికి అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, అధికారులు హాజరయ్యారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై 'ఇది మంచి ప్రభుత్వం' బ్రోచర్‌ను ఇంటింటికీ అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వంద రోజుల్లో అవ్వా,తాతలకు నెలకు రూ.4 వేలు పింఛన్, దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు అందిస్తున్నామని వక్తలు తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి ప్రజల ఆస్తుల భద్రత కల్పించామని పేర్కొన్నారు. నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ ప్రకటన, అనేక మంది పేదల ఆకలి తీర్చుతున్న అన్న క్యాంటీన్‌ల ఏర్పాటు జరిగిందన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం సకాలంలో కొనుగోలు చేసి ఆదుకున్నామని, వరదల సమయంలో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు చేపడుతోందని వివరించారు.

జిల్లాలో తొలిరోజు శుక్రవారం హోం మంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట, నక్కపల్లిల్లో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వంద రోజుల పాలనపై మంత్రి కేక్ కట్ చేశారు. అనకాపల్లి నియోజకవర్గం కశింకోటలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు తదితరులు పాల్గొని వంద రోజుల ... మిగతా 8వ పేజీలో

సెజ్, ఫార్మా కార్మికుల పరిస్థితి దయనీయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అచ్యుతాపురం, సెప్టెంబరు 20:

సెజ్, ఫార్మా కర్మాగారాల్లో కార్మికుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కార్మికులు, ప్రజల రక్షణకు సీపీఎం చేస్తున్న యాత్రలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సెజ్‌లోని గార్మెంట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల జీవితాలు అత్యంత నికృష్టంగా ఉన్నాయన్నారు. తక్కువ జీతాలిచ్చి శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. అలాగే ఫార్మా కర్మాగారాల్లో కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కాలుష్య కారక కర్మాగారాలు ఏర్పాటు చేసి కార్మికులతోపాటు ప్రజలకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రాల్లో కారిడార్‌ల పేరుతో లక్షల ఎకరాలు సేకరిస్తున్నా వినియోగంలోకి తేవడం లేదన్నారు. కాకినాడలో పది వేల ఎకరాలు సేకరించి. కేవలం 150 ఎకరాల్లో ఒక్క పరిశ్రమ మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా పారిశ్రామిక వేత్తలకే కొమ్ముకాస్తోందన్నారు. సమావేశంలో నాయకులు సీపీఎం నాయకులు లోకనాథం, బి.ప్రభావతి, ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, రొంగలి రాము, డి.వెంకన్న, కర్రి అప్పారావు, జి.దేముడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతు బేజార్

అసంపూర్తిగా చోడవరం మోడల్ రైతు బజారు

- గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- రహదారిపైనే రైతులు, చిరువ్యాపారుల పాట్లు



రోడ్డుపై నిలబడి కూరగాయలు అమ్ముకుంటున్న మహిళా రైతులు

చోడవరం, సెప్టెంబరు 20:

నియోజకవర్గ కేంద్రంలో రూ.3 కోట్లతో చేపట్టిన మోడల్ రైతు బజారు నిర్మాణం ఆగిపోయింది. 2017లో నిర్మాణం చేపట్టిన రైతు బజారును గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఆరేళ్లుగా రైతులు, చిరువ్యాపారులకు నిలువ నీడ లేకుండా పోయింది. రైతులు రోడ్ల పక్కన కూరగాయలను అమ్ముకోవలసిన దుస్థితి నెలకొంది.

చోడవరం పట్టణ నడిబొడ్డున ప్రేమసమాజం రోడ్డులో గతంలో రైతు బజారు ఉండేది. ఈ రైతు బజారులో రేకుల షెడ్‌లు ఉండేవి. ఇక్కడ వర్షపు నీరు పోయే దారి లేకపోవడంతో వర్షాకాలంలో చినుకు పడితే రైతులకు, కొనుగోలుదారులకు ఇబ్బందికర పరిస్థితి ఉండేది. దీంతో



అసంపూర్తిగా మోడల్ రైతుబజారు

పాత రైతు బజారు స్థానంలో రూ.3 కోట్లతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మోడల్ రైతు బజారు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక పక్క కూరగాయలు, మరో పక్క పూలు, పండ్లు, ఇంకో వైపు చేపలు, మాంసాహార దుకాణాలు విడివిడిగా ఏర్పాటు చేసేందుకు 64 దుకాణాల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణాలు కూడా దాదాపుగా చివరి దశకు చేరుకుంది. ఈలోగా ఎన్నికలు జరిగి 2019లో అధికారం మారి వైసీపీ ప్రభుత్వం రావడంతో మోడల్ రైతు బజారు నిర్మాణం నిలిచిపోయింది. అనంతరం ఈ రైతు బజారును స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోకి తరలించేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేసినా అక్కడకు వెళ్లడానికి రైతులు, చిరువ్యాపారులతోపాటు కొనుగోలుదారులు కూడా ఆసక్తి చూపించకపోవడంతో రైతులు, చిరువ్యాపారులకు రోడ్డు కష్టాలు తప్పలేదు.

నీడ కరువైన రైతులు, వ్యాపారులు

రైతు బజారు నిర్మాణం నిలిచిపోవడంతో రైతులు, చిరు వ్యాపారులకు నిలువ నీడ లేకుండా పోయింది. వీరు ప్రధాన రహదారిపై దుకాణాలు వేసుకుని ఉత్పత్తులు విక్రయించుకునేవారు. అయితే ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ... మిగతా 8వ పేజీలో

34 మంది ఎస్ఐల బదిలీ

జిల్లా ఎస్పీ దీపిక ఉత్తర్వులు జారీ

- వీఆర్‌లో ఉన్న పలువురికి పోస్టింగ్

కొత్తూరు, సెప్టెంబరు 20:

జిల్లాలో 34 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాతవరం ఎస్ఐ ఎం.రామారావును పరవాడకు బదిలీ అయ్యారు. గొలగొండ ఎస్ఐ బి. రామకృష్ణారావు పరవాడకు, దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర రాంబిల్లికి, ఎలమంచిలి రూరల్ ఎస్ఐ పి.సింహాచలం సబ్బవరం పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు అనకాపల్లి పట్టణ పోలీసుస్టేషన్‌కు, డీఎస్‌బీ అనకాపల్లి ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు అనకాపల్లి పట్టణ పోలీసుస్టేషన్‌కు, అనకాపల్లి పట్టణ ఎస్ఐగా ఉన్న ఎండీ ఆలీ షరీఫ్ అనకాపల్లి ఉమెన్ పీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న ఎ.శ్రీనివాసరావు బుచ్చెయ్యపేట పీఎస్‌కు, బి.సురేష్‌బాబు, జి.ధనుంజయనాయుడులను డీఎస్‌బీ అనకాపల్లికి బదిలీ చేశారు. అచ్యుతాపురం ఎస్ఐ ఎం.నారాయణరావును అనకాపల్లి సీసీఎస్‌కు, నర్సీపట్నం టౌన్ పీఎస్ ఎస్ఐ కె.సుధాకర్ అచ్యుతాపురం పీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న జె.రమేష్‌ను నర్సీపట్నం టౌన్ పీఎస్‌కు, సాకేటి ప్రసాద్‌ను అనకాపల్లి డీపీఆర్‌బీ, కె.సన్నిబాబును నక్కపల్లి పీఎస్‌కు, ఎస్.అప్పలకొండను పీసీఆర్ అనకాపల్లికి, ఎస్‌కె. మదీనావలీని పీసీఆర్ అనకాపల్లికి, ఎస్‌కే. రషీద్‌ను సీసీఎస్ అనకాపల్లికి, జె.నాగేశ్వరరావును సీసీఎస్ అనకాపల్లికి, జి.విశ్వనాథంను డీఎస్‌బీ అనకాపల్లికు, ఎన్.భాస్కరరావును బుచ్చెయ్యపేట పీఎస్‌కు, పి.కామేశ్వరరావును డీఎస్‌బీ అనకాపల్లికి, పి.ప్రసాదరావును పరవాడ పీఎస్‌కు, ఎం.సురేంద్రకుమార్‌ను ఎస్‌హెచ్ స్క్వాడ్ అనకాపల్లి, ఎం. వెంకట్రావును డీఎస్‌బీ అనకాపల్లి, పీవీ.వెంకటరమణను సీసీఎస్ నర్సీపట్నం, కె.సత్యనారాయణను సీసీఎస్ నర్సీపట్నం టౌన్‌కు బదిలీ అయ్యారు. అనకాపల్లి పీసీఆర్‌లో ఉన్న బి.అంజిబాబును డీఎస్‌బీ అనకాపల్లికి, చోడవరం ఎస్ఐ డి.శేఖరం అనకాపల్లి ట్రాఫిక్‌కు, వెయిటింగ్ పోస్టింగ్‌లో ఉన్న పి.మనోజ్‌కుమార్ కశింకోట పీఎస్‌కు, జి.సత్యనారాయణను అనకాపల్లి ట్రాఫిక్‌కు, యు.రాజారావును పీఆర్.పేటకు, డి.పణిదాస్‌ను అనకాపల్లి సీసీఎస్‌కు, కె.సంతోష్‌కుమార్‌ను అనకాపల్లి పట్టణ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేసినట్టు ఎస్పీ దీపిక పేర్కొన్నారు.

భీమిలి ఆర్డీవో బరితెగింపు!

రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి వ్యవహారంలో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా ఏడాది కిందట నివేదిక

- నాటి వైసీపీ కీలక నేతల హస్తం?
- తప్పును గుర్తించి, అడ్డుకున్న జేసీని బదిలీ చేసిన వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం రావడంతో వెలుగులోకి అక్రమాలు
- ఆర్డీవో సహా ముగ్గురిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం
- ఉన్నతాధికారుల తాత్సారం



భాస్కరరెడ్డి

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

ఆయనో రెవెన్యూ ఉన్నతాధికారి. ప్రభుత్వ భూములను, ఆస్తులను రక్షించాల్సిన ఆయన...అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. సుమారు రూ.100 కోట్లకు పైగా విలువైన భూమి ప్రైవేటు వ్యక్తుల పరం చేసేందుకు తన వంతు సహకారం అందించారు. గత ప్రభుత్వ పాలకులు తమ అవసరాల కోసం ఏరికోరి తెచ్చుకున్న సదరు అధికారి తప్పు చేసినట్టు తేలినా కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

జిల్లాల విభజన అనంతరం విశాఖపట్నం జిల్లాలో కొత్తగా ఏర్పాటైన భీమిలి రెవెన్యూ డివిజన్ అధికారిగా వచ్చిన ఎస్.భాస్కరరెడ్డి వైసీపీ నేతలు చెప్పిందల్లా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. డివిజన్‌లో వందలాది ఎకరాల డీపట్టా భూముల ఫ్రీహోల్డ్ వ్యవహారంలో అప్పటి పాలకులు/ఉన్నతాధికారులు చెప్పినట్టు నడుచుకున్నారనే విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆయన వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి వ్యవహారంలో ప్రైవేటు వ్యక్తికి అనుకూలంగా నివేదిక ఇచ్చిన విషయం వెలుగుచూసింది.

కోట్ల విలువైన భూమి పరాధీనం చేసే యత్నం

మధురవాడలో వీఎంఆర్‌డీఏ నిర్మించిన హరిత గృహ సముదాయానికి ఎదురుగా సర్వే నంబరు 133లో గల 9.36 ఎకరాలను 2008లో హౌసింగ్ బోర్డుకు ప్రభుత్వం బదలాయించింది. అప్పట్లో విశాఖ రూరల్ తహసీల్దారుగా ఇదే భాస్కరరెడ్డి ఆ భూములను హౌసింగ్ బోర్డుకు అప్పగించారు. అప్పటి నుంచి ఆ 9.36 ఎకరాలు హౌసింగ్ బోర్డు ఆధీనంలోనే ఉంది. ఈ భూమిలో హౌసింగ్ బోర్డు ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచింది. ఆ భూమిపై కన్నేసిన ఒక వ్యక్తి సర్వే నంబర్ 133లో 3.47 ఎకరాలు తనదంటూ ఏడాది క్రితం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. భూమి కొట్టేయడానికి వీలుగా తప్పుడు పత్రాలు సృష్టించారు. ఐటీ సంస్థలు, భారీ విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు ఉన్న ఆ ప్రాంతంలో ఎకరా రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు పలుకుతుంది. తప్పుడు పత్రాలతో భూమి కాజేసే యత్నం వెనుక నాటి వైసీపీలో కీలక వ్యక్తులు ఉండడంతో అధికారులు ఫైలు ఆగమేఘాలపై ముందుకు కదిపారు. సర్వే నంబరు 133లో 9.36 ఎకరాలను హౌసింగ్ బోర్డుకు అప్పగించిన విషయాన్ని ప్రస్తావించకుండా భీమిలి ఆర్డీవో ద్వారా జేసీకి పంపారు. ఈ ఫైలు అందే సమయంలో జేసీగా విశ్వనాథన్ ఉన్నారు. అదే సమయంలో మధురవాడలో తమకు కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని హౌసింగ్ బోర్డు అధికారులు జేసీకి చెప్పడంతో పాటు భూమి వివరాలు అందజేశారు. దీంతో ఆయన అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అప్పటికే తన వద్ద ఉన్న ఫైలులో ఉన్న సర్వే నంబరు, బోర్డు అధికారులు ఇచ్చిన సర్వే నంబరు ఒక్కటే కావడంతో ఆయనకు అనుమానం ... మిగతా 8వ పేజీలో

సాహితీ సంస్కర్త... గురజాడ



- సంఘ సంస్కరణలకు సాహితీ సేద్యం
- మూఢనమ్మకాలపై అక్షర పోరాటం
- సామాజిక రుగ్మతలపై ఎలుగెత్తిన గళం
- నేడు గురజాడ వేంకట అప్పారావు జయంతి

'తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండి, డామిట్ కథ అడ్డం తిరిగింది, పొగతాగనివాడు దున్నపోతై పుట్టున్'... ఈ మాటలు వింటే గుర్తుకొచ్చేది మహాకవి గురజాడ. అజ్ఞానం, మూఢత్వంతో నిండిన సమాజాన్ని అక్షర సేద్యంతో జ్ఞాన జ్యోతి వెలిగించిన సాహితీవేత్త గురజాడ వేంకట అప్పారావు. ఆధునిక సాహిత్య యుగకర్తగా పేర్గాంచిన ఆ మహాకవి తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన రచనల్లో అగ్రగణ్యమైనది కన్యాశుల్కం నాటకం. డబ్బు కోసం చిన్న పిల్లల్ని ముసలివారికి ఇచ్చి పెళ్లి చేసే దురాచారం, వేశ్యా లోలత్వంతో ఎదురయ్యే సమస్యలపై ఒకేసారి కలం ఝుళిపించి సాంఘిక దురాచా రాలను కడిగి పారేసిన అక్షరయోధుడు. ఆ మహనీయుడు పుట్టినది ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్.రాయవరం. నేడు గురజాడ జయంతి సందర్భంగా కథనం. విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి/ ఎస్.రాయవరం

ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసిద్ధి రాయవరం (ఎస్.రాయవరం)లో 1862 సెప్టెంబరు 21న వెంకట రామదాసు, కౌసల్యమ్మ దంపతులకు గురజాడ వేంకట అప్పారావు జన్మించారు. ఉన్నత చదువుల కోసం విజయనగరం వెళ్లారు. వచన, వ్యవహారిక భాషకు ఆద్యుడిగా పేరొందిన గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ ప్రాణస్నేహితులు. 1915 నవంబరు 30న భౌతికంగా దూరమైనా ఆయన రచనలు ఇప్పటికీ పాఠక హృదయాల్లో నిలిచిపోయాయి. పూర్వం సర్వసిద్ధిలో కోర్టు ఉండేది. గురజాడ తాతగారు అక్కడే పనిచేసే వారు. గురజాడ తల్లి ప్రసవం కోసం ఎస్.రాయవరం వచ్చారు. అక్కడ మేనమామ ఇంట గురజాడ జన్మించారు.




19వ శతాబ్దంలో సామాజిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని దార్శనిక దృక్పథంతో రచనలు చేసిన కొద్దిమందిలో గురజాడ ఒకరు. ఆధునిక సాహిత్యంలో కొత్త ఒరవడులకు శ్రీకారం చుట్టి తెలుగు సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించిన కవి. తరాలు మారినా ఇప్పటికీ 'కన్యాశుల్కం' పాఠకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉండడానికి అదే కారణం. కన్యాశుల్కం ఇతర భాషల్లోకి అనువాదమై ఆదరణ పొందేందుకు ఇతివృత్తం, రచనలోని పటుత్వమే నిదర్శనం.

గ్రాంథికం నుంచి వ్యవహారికానికి...

గురజాడ రచనలు ప్రారంభించే నాటికి సంప్రదాయవాదులదే ఆధిపత్యం. గ్రాంధికానిదే పైచేయి. ఆ సమయంలో వ్యావహారిక భాషలో రచనలు ప్రారంభించి ప్రయాణాన్ని ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేక శైలికి శ్రీకారం చుట్టారు. ఇతివృత్తమే ప్రధానంగా రచనలు సాగించారు. ఇందుకు కన్యాశుల్కం ఉదాహరణ. ఉపోద్ఘాతాలు, వర్ణనలు లేకుండా గురజాడ సరాసరి కథను ప్రారంభించేవారు. నాటి సాంఘిక దురాచారాలైన కన్యాశుల్కం, వేశ్యాలోలత్వం ఇందులో ప్రధాన కథా వస్తువు. భర్త తీరుపై అసంతృప్తి ఉందని పుట్టింటికి పారిపోకుండా, అతనితో తగాదా పెట్టుకోకుండా, గడప దాటకుండా భర్తకు బుద్ధిచెప్పిన భార్య తీరును గుర్తు చేస్తుంది ఈ నాటకంలోని కథానాయకి పాత్ర.

మలయాళంలోకి గురజాడ సాహిత్యం

విశాఖపట్నం, సెప్టెంబరు 20: గురజాడ అప్పారావు సాహిత్యాన్ని గురజాడ కళామంజిరి పేరిట నగరానికి చెందిన ప్రముఖ రచయిత, అనువాదకులు ఎల్ఆర్‌స్వామి మలయాళంలోకి అనువదించారు. ఈ భాషలోకి అనువదించిన గురజాడ అప్పారావు తొలి సాహిత్యం ఇదే. ఇందులో గురజాడ రచించిన ఆరుకథలతో పాటు గురజాడ దేశభక్తి గేయం ఉంది. గురజాడ సాహిత్యంపై ప్రముఖ రచయితలు విహారి, వివినమూర్తి, చాగంటి తులసి, అట్టాడ అప్పలనాయుడు, కేపీ శివకుమార్, డాక్టర్ ఎన్.రజని, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య కిన్నెర శ్రీదేవి, కిరణప్రభ రాసిన వ్యాఖ్యానాలు ఇందులో ఉన్నాయి. గురజాడ ఫౌండేషన్ (అమెరికా) అధ్యక్షుడు కొవ్వలి గోపాలకృష్ణ కోరిక మేరకు దీనిని అనువదించారు. ఈ పుస్తకాన్ని పరిధి పబ్లికేషన్స్ తిరువనంతపురం (కేరళ), గురజాడ ఫౌండేషన్ అమెరికా సంయుక్తంగా ప్రచురించాయి. ఈ పుస్తకాన్ని తిరువనంతపురంలో ప్రముఖుల చేతులమీదుగా ఆవిష్కరించనున్నట్టు ఎల్ఆర్ స్వామి తెలిపారు.



మలయాళంలో గురజాడ పుస్తకం

మతిమరుపుతో జాగ్రత్త!

తొలిదశలో వైద్యులను సంప్రదిస్తే మేలు

- 65 ఏళ్లు దాటిన వారిలోనే సమస్య అధికం
- వ్యాధిగ్రస్తులకు కుటుంబ సహకారం అవసరం
- నేడు ప్రపంచ అల్జీమర్స్ డే

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)


ఓ వయసు వచ్చాక జ్ఞాపక శక్తి తగ్గడం సాధారణం. ఇది అసాధారణమైతే అల్జీమర్స్ అంటారు. అచ్చతెలుగులో 'మతి మరుపు వ్యాధి' అని అర్థం. మెదడులోని జ్ఞాపకాలు చెరిగిపోవడం అల్జీమర్స్. నేడు అల్జీమర్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

మతిమరుపు (డిమాన్షియా) రెండు రకాలు. మొదటిది వాస్క్యులర్ డిమాన్షియా. మెదడుకు సరిగా రక్తప్రసరణ జరగని వారిలో ఈ సమస్య కనిపిస్తుంది. పక్షవాతం, అధిక రక్తపోటు, డయాబెటిక్, స్మోకింగ్, అధిక కొలస్ట్రాల్, మద్యం అలవాటున్నవారిలో కనిపిస్తుంది. సకాలంలో వైద్యుడిని సంప్రదిస్తే వ్యాధి తీవ్రత పెరగకుండా చూడొచ్చు. రెండోది సూడో డిమాన్షియా. వాస్తవంగా ఇది వ్యాధి కాదు. మందులతో నయమయ్యే సమస్య. అధిక ఒత్తిడి, డిప్రెషన్, మద్యం, మాదక ద్రవ్యాల అలవాటు ఉన్నవారిలో సమస్య ఎక్కువ. ఇక మెదడులో కణితులు, ఇన్‌ఫెక్షన్ ఉంటే దానివల్ల కూడా అల్జీమర్స్ వచ్చే అవకాశం ఉంది.

65 ఏళ్లు దాటాక...

అరవై ఐదేళ్లు దాటాక మతిమరుపు సాధారణం. వీరిలో జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. ఇది అసాధారణంగా ఉండడం, చిన్నచిన్న విషయాలు గుర్తుండకపోవడాన్ని అల్జీమర్స్ అంటారు. మెదడులోని కొన్ని కణాలు దెబ్బతినడం వల్ల వస్తుంది. సమస్యకు ఇదీ ప్రత్యేక కారణమనేది లేకున్నా జన్యుపరమైన అంశాలు కొంతవరకు కారణం.





ఇలా గుర్తించాలి (మొదటి దశ)

- కళ్లద్దాలు, పెన్ను, సెల్‌ఫోన్‌తో పాటు దారి కూడా మర్చిపోవడం.
- ఎప్పుడూ చేసే పనులు చేసుకోలేకపోవడం
- ఒక విషయంపై ఆలోచన చేయలేకపోవడం
- పొంతనలేకుండా మాట్లాడడం, వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోలేకపోవడం

తీవ్రత పెరిగితే...

- కుటుంబ సభ్యులను కూడా గుర్తించలేకపోవడం, అయోమయంగా చూడడం.
- కుటుంబ సంబంధాలు మరచిపోవడం
- ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకుండా గొణగడం
- స్నానం చేసి దుస్తులు వేసుకోకుండా రావడం
- ఆహారం తీసుకున్న విషయం కూడా గుర్తులేకపోవడం.

చికిత్స విధానం

ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే 'డొనిఫిజల్, ఇవాస్టిగ్మిన్ వంటి మందులు ఇస్తారు. దీని వల్ల మెదడులో హార్మోన్ల విడుదల జరిగి కణాలు క్రియాశీలకమవుతాయి. వ్యాధిగ్రస్తులకు కుటుంబ సభ్యుల సహకారం అవసరం. నిత్యం రోగితో మాట్లాడుతుండాలి. వారి మెదడుకు పనిచెప్పేలా చెస్, క్యారమ్స్, సుడోకో వంటి ఆటలు ఆడించాలి. తప్పులు చేస్తే విసుగు చెందకూడదు. ఉద్యోగ విరమణ తర్వాత పని మానేయకుండా మెదడుకు ఏదో ఒక పని చెప్పాలి.

అల్జీమర్స్ లక్షణాలు

సాధారణంగా ప్రతి ఒక్కరిలో తక్షణ, రీసెంట్, రిమోట్ జ్ఞాపకశక్తులు ఉంటాయి. వ్యాధి బారినపడిన వారు ఈ మూడు రకాల జ్ఞాపక శక్తులను మెల్లగా కోల్పోతారు. తొలి రెండురకాల జ్ఞాపకశక్తులను వేగంగా కోల్పోయినా, రిమోట్ మెమొరీ కొన్నాళ్లు బాగానే ఉంటుంది. వ్యాధి తీవ్రత పెరిగేకొద్ది ఇదీ పోతుంది. వ్యాధి తీవ్రంగా ఉంటే పేర్లు, వస్తువులు కూడా గుర్తించలేరు.

యువతలోనూ మతిమరుపు సమస్య



మతిమరుపు కేసులు కొన్నాళ్లుగా పెరుగుతున్నాయి. కేజీహెచ్‌లో ప్రత్యేకంగా మెమరీ క్లినిక్ నిర్వహిస్తున్నాం. ఈ క్లినిక్‌కు ప్రతిరోజూ 15 మంది వరకు వస్తున్నారు. ఓపీకి కూ డా ఈ సంబంధిత సమస్యలతో వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వీరిలో 30 నుంచి 40 ఏళ్లలోపు యువత ఒకరిద్దరు ఉంటున్నారు. యువతలో మతిమరుపు సమస్యకు ప్రధానం గా బి 12, విటమిన్ ఈ, నియాసిన్ లోపంతోపాటు ఆటో ఇమ్యునో ఎన్‌సెఫ్లైటిస్, థైరాయిడ్ వంటి సమస్య కనిపి స్తోంది. బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టడం, ఇతర మార్పులతో పెద్దవారిలో మతిమరుపు అధికమవుతోంది. 50 ఏళ్లు దాటిన వారిలో బ్రెయిన్ పరిమాణం తగ్గుముఖం పట్టడం, బ్రెయిన్ క్లాట్స్, ఒత్తిడి, బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్, ట్యూమర్స్, మెదడుకు గాయాలు కారణమవుతున్నాయి. సమస్యను గుర్తించి మందు లు వాడితే కొంత ఫలితం ఉంటుంది. అల్జీమర్స్‌పై అవగాహ న కల్పించేందుకు బీచ్ రోడ్డులో శనివారం ఉదయం వాక్, ఉచిత క్లినిక్ ఏర్పాటు చేస్తున్నాం.

- డాక్టర్ ఎస్.గోపి, న్యూరాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

క్రైం... crime news

64 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు

- కారు స్వాధీనం



గంజాయితో దొరికిన నిందితులు

దేవరాపల్లి, సెప్టెంబరు 20: గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు చేసి కారుతో పాటు 64 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు సిబ్బందితో శ్రీరాంపురం వై.జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అల్లూరి జిల్లా వైపు నుంచి వచ్చిన కారు తనిఖీ చేపట్టగా, అందులో రూ.64 కిలోల గంజాయి దొరికింది. దీంతో కారులో ఉన్న ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పనసపుట్టు పంచాయతీ శివారు జామిగుడ గ్రామానికి చెందిన కొర్రా రంజు (30), కొర్రా అర్జున్ (28)తో పాటు పెదబయలుకు చెందిన కారు డ్రైవరు కూడా కార్తీక్ (40)ను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో రంజు, అర్జున్ గంజాయి పండిస్తుంటారని ఎస్ఐ చెప్పారు. కారు యజమాని గుంజా గోపి, హుకుంపేటకు చెందిన గన్నెలపట్టుకు చెందిన కొర్రా శివ కలసి ఈ 64 కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్టు ఎస్ఐ చెప్పారు. నిందితులను అరెస్టు చేశామని తెలిపారు.

నాలుగు లీటర్లు సారాతో ఒకరిని అరెస్టు

గొలుగొండ, సెప్టెంబరు 20: నాలుగులీటర్లు నాటుసారాతో ఒకరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. మండలంలోని గొలుగొండ దళిత కాలనీలో నాటుసారా విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో శుక్రవారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో మట్ల చిలకారావు నాటుసారా విక్రయిస్తుండగా ఆయన వద్ద నాలుగు లీటర్లు నాటుసారా స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నర్సీపట్నం కోర్టుకు హాజరుపర్చగా ఈ వ్యక్తికి కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

లా వర్సిటీలో 'డీవీ సుబ్బారావు జాతీయ స్థాయి మధ్యవర్తిత్వ పోటీ'లు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, సెప్టెంబరు 20: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యత, ప్రాచుర్యం పెరిగిందని ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు అన్నారు. వర్సిటీలో ప్రముఖ న్యాయవాది 'డీవీ సుబ్బారావు జాతీయ స్థాయి మధ్యవర్తిత్వ పోటీ'లను శుక్రవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మధ్యవర్తిత్వంపై ప్రాధాన్యత పెరిగినందున అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా మధ్యవర్తిత్వాన్ని ఏ విధంగా నిర్వహించాలన్న అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఇక్కడి వర్సిటీలో మూడు రోజుల పాటు ఈ మధ్యవర్తిత్వ పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి 24 జట్లు పాల్గొంటున్నాయన్నారు. మూటింగ్ సొసైటీ ఫ్యాకల్టీ డాక్టర్ వి.సునీత మాట్లాడుతూ దేశంలోనే ప్రముఖ న్యాయవాది అయిన డీవీ సుబ్బారావు పేరుపై ఈ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, అకాడమీ డీన్ సోమా భట్టాచార్య, ఎక్సామినేషన్ డీన్ డాక్టర్ కె.సుధ, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ నీలిమ, డాక్టర్ సీహెచ్.లక్ష్మి, సంస్కృతి సిన్హా, అర్షిత్ మిశ్రా, కార్తికే బన్సాల్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఇంట్లో తిన్నాం 'అన్న' సంతృప్తి కలిగింది

- అనకాపల్లిలో అన్న క్యాంటీన్‌లకు పోటెత్తిన పేదలు
- రుచికరమైన భోజనాలు వడ్డించడంతో ఆనందం



ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో భోజనానికి క్యూ కట్టిన ప్రజలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20: పట్టణంలో అందుబాటులోకి వచ్చిన అన్న క్యాంటీన్‌లకు ప్రజలు పోటెత్తుతున్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వే స్టేషన్‌ల వద్ద గురువారం రాత్రి ఇవి పునఃప్రారంభమైన సంగతి తెలిసిందే. శుక్రవారం ఈ రెండు క్యాంటీన్లు రద్దీగా మారాయి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను వడ్డించారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద పేదలతో పాటు వైద్యాలయానికి వచ్చే రోగులు, గర్భిణులు, వారి సహాయకులు పెద్ద ఎత్తున క్యాంటీన్‌కు చేరుకుని ఐదు రూపాయల టోకెన్ తీసుకుని కడుపునిండా భోజనం చేశారు. మధ్యాహ్నం అన్నం, సాంబరు, వంకాయకూర, పచ్చడి, పెరుగు వడ్డించారు. భోజనం చేసిన ప్రతి ఒక్కరూ వంటకాలు చాలా రుచిగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఈ క్యాంటీన్ లేకపోవడం వల్ల ఆసుపత్రికి వచ్చి మధ్యాహ్నం వేళల్లో బయట హోటళ్లకు వెళ్లి రూ.వంద వెచ్చించి భోజనం చేయాల్సి వచ్చేదని ఒక గర్భిణి 'ఆంధ్రజ్యోతి' వద్ద అన్నారు. అన్న క్యాంటీన్ అందుబాటులోకి రావడం వల్ల ఇక ఎప్పుడు ఆస్పత్రికి వచ్చినా భోజనం సమస్య ఉండదన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ఉన్న క్యాంటీన్‌లో వైద్యాలయంలో పనిచేసే కార్మికులతో పాటు రోగులు, సమీప కూరగాయలు, కొబ్బరికాయల మార్కెట్‌లో పనిచేసే కార్మికులు భోజనాలు చేశారు. ఇక్కడ మధ్యాహ్నం 390 మంది వరకు భోజనాలు చేసినట్టు నిర్వాహకుల ద్వారా తెలిసింది. అలాగే రైల్వేస్టేషన్ వద్ద భవన నిర్మాణ కార్మికులు, రిక్షా కార్మికులు, స్థానిక పేదలు భోజనాలు చేశారు. ఇక్కడ కూడా 300 మందికి పైగా భోజనాలు చేసినట్టు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో మూసివేసిన అన్న క్యాంటీన్లు కూటమి ప్రభుత్వం పుణ్యమా అంటూ అందుబాటులోకి రావడం పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలపై రోడ్డెక్కిన విద్యార్థులు

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- ప్రభుత్వం దృష్టికి తీసువెళ్తామని డీఆర్వో దయానిధి హామీ



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మధ్యాహ్నం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో అనకాపల్లిలోని శంకరంలోగల కలెక్టరేట్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు విద్యార్థి సంఘ ప్రతినిధులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు చెల్లించాల్సిన మెస్ చార్జీలు పెంచాలని, గత ప్రభుత్వం చెల్లించాల్సిన వసతి దీవెన, విద్యా దీవెన, కాస్మొటిక్ చార్జీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. దీంతో డీఆర్వో బి.దయానిధి విద్యార్థుల వద్దకు వచ్చి వారితో చర్చించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధులు ఎం.బాలాజీ, కేశవ్, వెంకటేశ్, రమేశ్, జ్ఞానేశ్, స్వామి, అర్జున్, దుర్గా, మోహన్, సాయి, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడుగా మీసాల సుబ్బన్న ప్రమాణం

- క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దామని నాయకులు, కార్యకర్తలకు పిలుపు



ప్రమాణస్వీకారం చేసిన సుబ్బన్నను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20: కాంగ్రెస్ పార్టీని జిల్లాలో క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అంతా సమన్వయంతో కృషి చేద్దామని డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న అన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేసి మాట్లాడారు. గత నాలుగున్నర దశాబ్దాలుగా తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నానన్నారు. పార్టీలో వివిధ పదవులు చేపట్టిన తనకు రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. ఆమె నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రామారావు సుబ్బన్నతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.పైడయ్య, తనకాల అనంతరావు, మలపురెడ్డి కోటేశ్వరరావు, బోయిన భానుమూర్తి యాదవ్, కాళ్ల సత్యనారాయణ, కత్తెర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుబ్బన్నను ఘనంగా సత్కరించారు.

కల్యాణపులోవ జలాశయం 2 గేట్లు ఎత్తివేత

- సర్పానదిలోకి 100 క్యూసెక్కుల నీరు విడుదల

రావికమతం, సెప్టెంబరు 20: మండలంలోని కల్యాణపులోవ జలాశయ నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో రెండు గేట్లు ఎత్తి అదనపు నీటిని విడిచి పెట్టినట్టు ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. ఆయన శుక్రవారం జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్య 460 అడుగులు అని చెప్పారు. గురువారం రాత్రి రిజర్వాయర్ పరీవాహక ప్రాంతం ఎగువన కురిసిన వర్షాలకు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో శుక్రవారం నాటికి 458.90 అడుగులకు నీటి మట్టం చేరిందన్నారు. సామర్థ్యానికి మరో ఒక అడుగు మాత్రమే ఉన్నందున రెండు గేట్లు ఎత్తి 100 క్యూసెక్కుల మేర నీటిని సర్పానదిలోకి విడిచి పెట్టడం ద్వారా రిజర్వాయర్ నీటి మట్టాన్ని స్థిరీకరిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో సర్పానదికి ఆనుకొని ఉన్న రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాలకు చెందిన చీమలపాడు, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, కొత్తకోట, కన్నంపేట, జగ్గంపేట, జె.నాయుడుపాలెం, కొమరవోలు, ఆర్.కొత్తూరు, కుసర్లపూడి, తూటిపాల, తాడపాల, కొండల అగ్రహారం గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈ సూచించారు.

6 నుంచి నునపర్తిలో బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు

- రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరు
- ట్రోఫీని ఆవిష్కరించి ఎమ్మెల్యే 'సుందరపు'



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, సెప్టెంబరు 20: మండలంలోని నునపర్తి గ్రామంలో వచ్చే నెల ఆరో తేదీ నుంచి మూడు రోజుల పాటు తొమ్మిదవ ఆంధ్రప్రదేశ్ బాల్‌బ్యాడ్మింటన్ అండర్-19 బాల బాలికల చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ట్రోఫీని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శుక్రవారం ఇక్కడ ఆవిష్కరించారు. రాష్ట్రంలోని పదమూడు జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరు కానున్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారు. అక్కడ అద్భుతంగా రాణించే వారు జాతీయ జట్టుకు ఎంపికవుతారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ప్రభాజీ, గొంప నరసింహనాయుడు తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ డే



విజ్ఞాపనలతో వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎస్పీ దీపికా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20: పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఇక్కడి ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎం.దీపికా గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బంది నుంచి విజ్ఞాపనలను స్వీకరించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

- డీఈవో వెంకటలక్ష్మమ్మ



మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈవో

మాకవరపాలెం, సెప్టెంబరు 20: మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని డీఈవో వెంకటలక్ష్మమ్మ హెచ్చరించారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం పెట్టించారు. మెనూ అమలు, విద్యా బోధన తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాల్లోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అలాగే హైస్కూల్‌లో చేస్తున్న బోధనపై ఉపాధ్యాయలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మూర్తి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ.. సంక్షేమం

▸▸ వంద రోజుల కూటమి పాలనలో ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు ▸▸ 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో మంత్రి అనిత, ఎమ్మెల్యేలు


ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు


పాయకరావుపేటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అనిత


కశింకోటలో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల


సబ్బవరం మండలం ఇరువాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల


సబ్బవరం మండలం మొగలిపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ


జీవీఎంసీ 84వ వార్డులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కార్పొరేటర్ చినతల్లి


రాంబిల్లి మండలం హరిపురంలో కరపత్రం అందిస్తున్న డి.రంగనాయకులు

పాయకరావుపేట, సెప్టెంబరు 20 : రాష్ట్రంలో ప్రతి పౌరుడు గౌరవంగా జీవించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం ఇక్కడి మండల పరిషత్ కాంప్లెక్ ఆవరణలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అందించి, రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తున్నట్టు చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేయడంతో పాటు పోలవరం ప్రాజెక్టుకు అత్యధిక నిధులు తీసుకువచ్చిన ఘనత ఎన్డీయే కూటమిదేనన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలను భ్రష్టుపట్టించిందని, తమ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం తీసుకువచ్చి గ్రామల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో సమస్యలు పరిష్కరించే దిశగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుచేస్తామన్నారు. పాయకరావుపేటకు అన్న క్యాంటిన్ మంజూరుచేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. త్వరలో పాయకరావుపేట మెయిన్‌రోడ్డు విస్తరణచేసి డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. త్వరలోనే గ్రామ వలంటీర్లకు న్యాయం చేస్తామని మంత్రి అనిత అన్నారు. అనంతరం పట్టణంలోని పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించనున్న ఆదనపు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ ఇసరపు పార్వతి, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, మణికంఠస్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.రవిరాజు, టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ సీహెచ్.వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, యాళ్ళ వరహాలబాబు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఈ కార్యక్రమం అనంతరం మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. తహసీల్దార్ జయప్రకాష్, ఎంపీడీవో సాంబశివరావు, పంచాయతీ ఈవో వర్మతో పాటు పీఆర్, రోడ్లు, భవనాలు, ఆర్‌డబ్ల్యూఎస్, జలవనరులశాఖల అధికారులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్ : మండలంలోని 23 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఇది మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వందరోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. మాసాహెబ్‌పేటలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రగతిని తెలియజేశారు.

నక్కపల్లి : కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం నక్కపల్లి సమీపంలో గల హోం మంత్రి వంగలపూడి అనిత నివాసం వద్ద పాయకరావుపేట నియోజకవర్గ కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంత్రి అనిత కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు. అలాగే, కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి కావడంతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నక్కపల్లి మండలంలోని అనేక గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు. ఇప్పటి వరకూ అమలు చేసిన పథకాలతో ముద్రించిన కరపత్రాలను అధికారులు, కూటమి నాయకులు ఇంటింటా పంపిణీ చేశారు. ఉపమాకలో ఎంపీడీవో శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు. నక్కపల్లిలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజయ్యపేట, పెదతీనార్ల గ్రామాల్లో టీడీపీ నాయకులు మడదా రాంబాబు, గంగరాజు, పిక్కి సత్తియ్య, మేరుగు నాగేశ్వరరావు, గోసల చినతాతారావు తదితరులు ఈ వేడుకలను నిర్వహించారు.

కశింకోట : దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో చేసిన అభివృద్ధిపై ప్రతి ఇంటికీ వెళ్లి వెళ్లి వివరించారు. రాష్ట్రం ఆర్థికంగా అప్పుల్లో ఉన్నా ప్రజలకు సంక్షేమ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లదేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్టీ నేతలు కాండ్రేగుల సతీష్, సిదిరెడ్డి శ్రీనివాసరావు, తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీను, కూటమి నేతలు పాల్గొన్నారు.

సబ్బవరం : రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నది ప్రజా ప్రభుత్వం అని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని ఇరువాడలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి పాలనలో వంద రోజుల్లో సాధించిన ప్రగతిని వివరించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ప్రత్యేకాధికారి కిరణ్‌కుమారి, ఎంపీడీవో రమేశ్‌నాయుడు, ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకట్, కూటమి నేతలు మిడతాడ మహాలక్ష్మీనాయుడు, కర్రి కనకరాజు, గొంప నర్సింగరావు, సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి, ఎంపీటీసీ కర్రి అప్పారావు, ఉప సర్పంచ్ బీఎస్ ప్రసాద్, రేసుపూడి రమణ, బలిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మొగలిపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ హాజరయ్యారు. ప్రజలకు మేలు చేసేది కూటమి ప్రభుత్వమని అన్నారు. కూటమి సర్కారు వంద రోజుల్లో సాధించిన విజయాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. సర్పంచ్ గండి అరుణ, ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ, బంగారునాయుడు, అంగటి నానాజీ, సత్యనారాయణ, కార్యదర్శి సంతోషి తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ ముందంజలో నిలుస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మునిసిపాలిటీలోని కొక్కిరాపల్లి వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో చేపట్టిన పనులను వివరించారు. మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, తహసీల్దార్ రాణి అమ్మాజీ, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, మజ్జి వీరబాబు జనసేన, టీడీపీ పట్టణ అధ్యక్షులు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, నాయకులు రాజాన నారాయణమ్మ, కొఠారు సాంబ, కొఠారు నరేష్, గుర్రాల శేఖర్, అన్నం బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కూటమి ప్రభుత్వంతోనే ప్రజారంజక పాలన సాధ్యమని మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల శేష అన్నారు. బయ్యవరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.మాజీ సర్పంచ్ గెంజి శ్రీను, నాయకులు ఎడ్ల నారాయణరావు, ఎం.బాబూరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలో పలు పంచాయతీల్లో ప్రారంభమైంది. కూటమి సభ్యులు ఇటింటికీ వెళ్లి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఖాజీపాలెం, ఆవరాజం, మడుతూరు, ఉప్పవరంలలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు పీలా తులసీరామ్, మోటూరు త్రివేణి, కూనిశెట్టి సత్తిబాబు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక నాయకులు అర్జిలి రవి, చింతకాయల అమ్మోరు, సూరాడ ముత్యాలరావు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : పట్టణంలో వాడవాడలా శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. 84వ వార్డులో కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయిన సందర్భంగా చేపట్టిన పనులను వివరించారు. అలాగే, భీమునిగుమ్మంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సబ్బవరపు గణేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాల ద్వారా వంద రోజుల పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. 80వ వార్డులో బొడ్డేడ మురళీ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఇక్కడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం అధికారుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతా ప్రదర్శనగా వెళ్లి వందరోజుల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరించారు. డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ శేషుకుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాల : అనకాపల్లి మండల మామిడిపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో చిన్నికృష్ణ హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విధానాలను వివరించారు. అలాగే పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రాంబిల్లి : కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా హరిపురంలో శుక్రవారం ఆయా నాయకులు ఈ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు వందరోజుల పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డి.అప్పారావు, డి.అప్పలనాయుడులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆయా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన నిర్వహించారు. వెంకటాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, గుడివాడలో మాజీ అధ్యక్షుడు ఎన్.వెంకటరాజు, పెట్టిగోళ్లపల్లిలో అల్లు నరసింహమూర్తి తదితర ఆధ్వర్యంలో పార్టీల శ్రేణులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ అన్నారు. కోటవురట్లలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో చేసిన అభివృద్ధిని వివరించారు. అలాగే, జల్లూరులోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ లాలం పద్మావతి, కోటవురట్ల ఎంపీటీసీ పి.సూర్యారావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

జీవో 85కు వ్యతిరేకంగా వైద్యులు ధర్నా

కొత్తూరు, సెప్టెంబరు 20 : జీవో నంబరు 85ను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది విధులను బహిష్కరించి శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు అనకాపల్లి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ తిరుపతిరావు, ఎస్తేర్ రాణి, యశోధ, వాణి, మనీషా, సంధ్య మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులకు ట్రైబల్ అలవెన్సు ఇవ్వాలని, 2020లో విధుల్లో చేరిన వైద్యులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు.

రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం

లంకెలపాలెం, సెప్టెంబరు 20 : జీవీఎంసీ 84వ వార్డు పరిధి సాలాపువానిపాలెంలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలను నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. తొలిత ఆయన క్రీడాకారిణులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.చినతల్లి, కూటమి నాయకులు పైలా జగన్నాథరావు, నీలబాబు, దుల్ల రామునాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు సాలాపు మోహన్‌రావు, వెంకట అప్పారావు, సుమన్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కినేని శతజయంతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 : పట్టణంలోని యర్రావారి వీధిలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యాలయంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినేని చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం, ప్రతినిధులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభిమానులు సేవా భావంతో మెలగాలి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 : అభిమానులు సేవా భావంతో పనిచేయాలని టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ సూచించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన పట్టణ బాలకృష్ణ, ఎన్టీఆర్ ఫ్యాన్స్ నూతన కార్యవర్గం సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఫ్యాన్స్ గౌరవాధ్యక్షులు పొలిమేర నాయుడు, అధ్యక్షుడు మళ్ల సంతోష్, కార్యదర్శి విల్లూరి అప్పలనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సదరం క్యాంపులో 29 మంది గుర్తింపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సదరం క్యాంపునకు కోటవురట్ల, నక్కపల్లి మండలాల నుంచి 46 మంది హాజరయ్యారు. ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్లు గంగాధర్, కనకదుర్గలు పరీక్షలు చేసి పథకానికి 29 మందిని అర్హులుగా గుర్తించారు.

వీఆర్‌వోల పనితీరుపై ఆర్డీవో ఆగ్రహం

కోటవురట్ల, సెప్టెంబరు 20 :అసైన్‌మెంట్ భూములు ఫ్రీ హోల్డ్ ప్రక్రియ పునర్విచారణలో పలువురు వీఆర్‌వోలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆర్డీవో జయరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఇక్కడరెవెన్యూ అధికారులు, వీఆర్‌వోలు, సర్వేయర్లతో ఆయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ విచారణ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జానకమ్మ, డీటీ అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆర్టిజెన్ సెల్ జిల్లా కో-కన్వీనర్లు నియామకం

కొత్తూరు, సెప్టెంబరు 20 : భారతీయ జనతా పార్టీ ఆర్టిజెన్ సెల్ అనకాపల్లి జిల్లా కో-కన్వీనర్ల నియామకం శుక్రవారం చేపట్టారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కో-కన్వీనర్లు మొల్లేటి ప్రసాద్, షేక్ నూరులకు నియామక పత్రాలు అందజేశారు.

వేతనాలు పెంచకుంటే సమ్మెకు వెనుకాడం

▸▸ విశాఖ డెయిరీ యాజమాన్యానికి పాల సంఘాల కార్యదర్శుల హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న పెంటకోట సత్యనారాయణ

తుమ్మపాల, సెప్టెంబరు 20 : వేతనాలు పెంచకుంటే సమ్మెకు వెనుకాడమని విశాఖ డెయిరీ యాజమాన్యానికి పాల సంఘాల కార్యదర్శులు హెచ్చరించారు. అనకాపల్లి పట్టణ పరిధి గవరపాలెంలో శుక్రవారం ఉత్తరాంధ్ర జిల్లాల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ పాల కేంద్రాల కార్యదర్శుల అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ మాట్లాడుతూ తమ సహకార సంఘాల ద్వారా పాలను సేకరించి విజయ విశాఖ డెయిరీకి పంపుతూ సంస్థ లాభాల బాటలో నడిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. అయినప్పటికీ పాల సంఘాల కార్యదర్శులకు, వర్కర్లకు ఐదు సంవత్సరాలుగా జీతాలు పెంచకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. తమ హక్కుల సాధన కోసం సమ్మె చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికులను డెయిరీ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాడ్యుటీ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం వాడుకున్న ఎనిమిది కోట్ల రూపాయలను తిరిగి వడ్డీతో సహా కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ట్రస్ట్ అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. జోనల్ ఆఫీసుల వద్ద దశల వారీగా ఆందోళనలు చేసి, పరిష్కారం కాకుంటే అంతిమంగా సమ్మెకు సిద్ధపడాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, దొడ్డి సూర్యారావు, జి.కనకారావు, కరక సోమునాయుడు, శ్రీకాకుళం నుంచి ప్రసాద్, విజయనగరం జిల్లా నుంచి జామి అప్పలనాయుడు, సన్యాసినాయుడు, రవి, లక్ష్మణరావు, తూర్పుగోదావరి జిల్లా నుంచి సుధాకర్ పాల్గొన్నారు.

'పరిశ్రమలున్న చోట సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలి'

పరవాడ, సెప్టెంబరు 20 : సెజ్‌తో పాటు, ఫార్మా పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రక్షణ యాత్ర శుక్రవారం ఉదయం లంకెలపాలెం నుంచి పరవాడ మీదుగా స్థానిక సినిమాహాల్ జంక్షన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, స్పెషల్ బర్న్‌వార్డులు లేకపోవడం వల్ల ప్రమాదాలకు గురైన కార్మికులను అనకాపల్లి, విశాఖపట్నంలకు తరలించే లోపు చనిపోతున్నారన్నారు. సెజ్ ఏర్పాటు చేసేటప్పుడు స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయలేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శులు కె.లోకనాథం, జి.కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ రమణ, పి.మాణిక్యం, వీవీ శ్రీనివాసరావు, డి.దేముడు, కె.వెంకటరావు, సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆందోళన

సబ్బవరం, సెప్టెంబరు 20 : మండల కేంద్రం సబ్బవరంలోని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాబ్జీ, జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ సరిపడా తరగతి గదులు లేక, కళాశాలకు వెళ్లేందుకు సరైన మార్గం లేక, చుట్టూ ప్రహరీ గోడ లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జె.సిద్ధు, సీహెచ్.శ్రీనివాస్, ఎం.ఇమ్మాన్యూయేల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలికల క్రీడా పోటీలు

ఎలమంచిలి, సెప్టెంబరు 20 : పట్టణంలోని కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు పాటు నిర్వహించిన బాలికల మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. పది ఉన్నత పాఠశాలల నుంచి బాలికలు ఉత్సాహంగా తలపడ్డారన్నారు. ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు క్రీడా పోటీల కో-ఆర్డినేటర్ వెంకట్రావు, పీఈటీ మూర్తి చెప్పారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తపు రాట


రాటోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 : పట్టణంలోని గవరపాలెం సతకంపట్టులో కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ముహూర్తపు రాటను వేశారు. ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ రాటోత్సవంలో పి.వెంకటఅప్పారావు, పొలిమేర శ్రీను, బుద్ధ సంతోష్ దంపతులు పూజలు నిర్వహించారు. వచ్చే నెల మూడవ తేదీ నుంచి ఉత్సవాలు జరగనున్నాయి. అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్‌గా భీమరశెట్టి వరహా నూకరాజు, డైరెక్టర్లుగా విల్లూరి మాధవ, పిళ్లా తారకేష్, పొలమరశెట్టి యుగంధర్, కాండ్రేగుల వెంకట సాంబశివరావు, కర్రి కల్యాణ్, దాడి త్రినాథ్, భీశెట్టి ప్రసన్న, మళ్ల రాజు, దాడి కిరణ్ ప్రమాణం చేశారు. నాయకులు దాడి జయవీర్, కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, కర్రి సన్యాసినాయుడు, వీధి పెద్దలు పాల్గొన్నారు.


పాయకరావుపేట : స్థానిక బృందావనంలోని దుర్గాలమ్మచెట్టు ఆలయం వద్ద దసరా ఉత్సవాల పందిరి రాటను శుక్రవారం వేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన

పరవాడ, సెప్టెంబరు 20 : మండల కేంద్రం పరవాడ శివాలయ ప్రాంగణంలో యాగశాల నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు శంకుస్థాపన చేశారు. ఎరువుల వ్యాపారి గండి లోకేశ్, దేవీ దంపతుల ఆర్థికసాయంతో యాగశాలను నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20 : గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను నిర్వహించారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రిల వేదమంత్రాల జడుమ ఈ వేడుకను జరిపారు.



భీమిలి ఆర్డీవో బరితెగింపు!

... 5వ పేజీ తరువాయి

వచ్చింది. సాధారణంగా తన వద్దకు భూముల ఫైలు వస్తే వెంటనే సదరు భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం విశ్వనాథన్‌కు అలవాటు. ఆయన స్వయంగా మధురవాడలో సర్వే నంబరు 133లో గల భూమిని పరిశీలించి హౌసింగ్ బోర్డుకు కేటాయించినదిగా గుర్తించారు. అయినా ప్రైవేటు వ్యక్తికి చెందిన భూమిగా పేర్కొంటూ ఫైలు పంపడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించి ఆర్డీవో, అప్పటి విశాఖ రూరల్ తహసీల్దార్, ఆర్‌ఐ, వీఆర్వోపై చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేశారు. తరువాత కొద్ది నెలలకు జేసీని ప్రభుత్వం బదిలీ చేయడం, ఈలోగా ఎన్నికలు రావడంతో భూమి వ్యవహారం తెరమరుగైంది. ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్వే నంబరు 133లో గల భూ వ్యవహారంపై దృష్టిసారించింది. అక్రమాలు జరిగినట్టు గుర్తించి ఆర్డీవో భాస్కర్‌రెడ్డితో పాటు ఆర్‌ఐ మల్లేశ్వరరావు, గ్రేడ్-2 వీఆర్వో దుర్గాప్రసాద్‌పై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. తహసీల్దారు రమణయ్య అప్పటికే హత్యకు గురికావడంతో ఆయన పేరు ప్రస్తావించలేదు. తహసీల్దారుగా ఉన్నప్పుడు సర్వే నంబరు 133లో భూమిని హౌసింగ్ బోర్డుకు అప్పగించిన భాస్కరరెడ్డి, అదే ఆర్డీవో అయిన తరువాత అదే భూమిలో 3.47 ఎకరాలు ప్రైవేటు వ్యక్తికి అప్పగించేలా ఫైలు పంపడం పరిశీలిస్తే అక్రమాలకు ఏ విధంగా సహకరించారో అర్థమవుతుందని రెవెన్యూలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా ఓట్ల లెక్కింపు అనంతరం సెలవుపై విదేశాలకు వెళ్లిన భాస్కర్‌రెడ్డి ఇటీవల తిరిగి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే హౌసింగ్ బోర్డు భూమి వివాదంలో ఆయనపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన ఫైలు సిద్ధమైంది. అయినా ఆయన ఆర్డీవోగా తిరిగి బాధ్యతలు స్వీకరించేందుకు ప్రభుత్వం అనుమతించడం ఆశ్చర్యకరం.

పోస్టింగ్‌ల కోసం పైరవీలు

... 5వ పేజీ తరువాయి

బదిలీల కోసం దరఖాస్తులు చేసుకొని కావలసిన చోటు కోసం ఎమ్మెల్యేల లేఖలతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కువ మంది ఉద్యోగులు ఏజెన్సీలో పోస్టింగులు పడకుండా మైదాన ప్రాంత మండలాల్లో పోస్టింగుల కోసం అప్షన్లు పెట్టుకున్నట్టు తెలుస్తోంది. చాలామంది ఉద్యోగులు జిల్లాల పునర్విభజన తరువాత అనకాపల్లి, ఏఎస్‌ఆర్ జిల్లాల్లో పనిచేస్తున్నా, ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రం నుంచే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది తిరిగి విశాఖ జిల్లాలో మండలాలకు బదిలీపై వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తు న్నారు. ఈ పరిస్థితి ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, సచివాలయాలు, ల్యాండ్స్, సర్వే శాఖల్లోనే ఎక్కువగా ఉంది. రెవెన్యూ శాఖలో కొందరు ఉద్యోగులైతే ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ పోస్టిం గుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో ఏజెన్సీ ప్రాం తంలో పనిచేసి వచ్చిన తమకు మళ్లీ ఏజెన్సీ ప్రాంతాలకు పంపేందుకు కుట్ర జరుగుతోందని పలువురు సర్వేయర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. బదిలీలను పారదర్శకంగా చేసి న్యాయం చేయాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

సందడిగా 'ఇది మంచి ప్రభుత్వం'

... 5వ పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి వార్డులో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం మేడిచర్ల గ్రామంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ విజయకృష్ణన్ హాజరై 'ఇది మంచి ప్రభుత్వం' బ్రోచర్‌ను మహిళలకు పంపిణీ చేశారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ దుగ్గాడ గ్రామంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


అచ్యుతాపురం ఖాజీపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

రైతు బేజార్

... 5వ పేజీ తరువాయి

ఏర్పడడంతో దుకాణాలన్నీ ఆంధ్రాబ్యాంకు రోడ్డు, ప్రేమసమాజం రోడ్డులోకి మళ్లించారు. అప్పటి నుంచి రోజూ ఈ రోడ్డుపైనే రైతులు, వ్యాపారులు కూరగాయలు విక్రయించుకుంటున్నారు. ఎండైనా.. వాన అయినా రైతులు నడిరోడ్డుపైనే కష్టాలు పడుతున్నారు. రైతు బజారు పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని ఇటు రైతులు, అటు చిరువ్యాపారులు ఎదురుచూస్తున్నా, ఇప్పటికీ వారి కష్టాలు తీరేదారి మాత్రం కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం, ఎమ్మెల్యే రాజు మళ్లీ ప్రజాప్రతినిధిగా ఎన్నిక కావడంతో తమ కష్టాలు ఇకనైనా తీరుతాయన్న ఆశాభావంతో ఉన్నారు.

రైతు బజారు పూర్తి చేయడమే లక్ష్యం

చోడవరంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు బజారును పూర్తిచేయడం నా లక్ష్యం. రైతు బజారు నిర్మాణాల పూర్తికి అవసరమైన నిధులు తీసుకు వస్తాను. దీనిని పూర్తి చేసి రైతులు, చిరువ్యాపారుల ఇక్కట్లు తీరుస్తాం.

కేఎస్‌ఎన్‌ఎస్ రాజు, ఎమ్మెల్యే , చోడవరం

సంతృప్తికరంగా పాలన

» మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, సెప్టెంబరు 20 : ప్రభుత్వం ఏర్పడి మొదటి వంద రోజుల్లోనే " ఇది మంచి ప్రభుత్వం " అని ప్రజల చేత అనిపించుకున్న కూటమి ప్రభుతాన్ని ఆశీర్వదించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని మేడిచర్లలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. తమ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయనుందన్నారు. ఇప్పటికే అందులో కొన్ని అమలు చేశామన్నారు. ప్రజా సహకారంతో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రాయపరెడ్డి కృష్ణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మహేష్, పూడి నారాయణమూర్తి, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపునకు సహకరిస్తే చర్యలు

» ఎడ్లబండ్ల యజమానులతో ఎస్ఐ దివ్య

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 20 : అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని కృష్ణాదేవిపేట ఎస్ఐ టి.దివ్య ఎడ్లబండ్ల యజమానులకు హెచ్చరించారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎడ్లబండ్ల యాజమానులతో ఆమె సమావేశమయ్యారు. కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా బొడ్డేరు వంతెన, సాగునీటి ప్రాజెక్టు వద్ద నుంచి ఇసుక తరలిస్తున్నారని, ఇందుకోసం వారు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను విరివిగా ఉపయోగిస్తున్నారని ఎస్ఐ అన్నారు. అలాంటి వారికి సహకారం అందిస్తే కేసుల్లోఇరుక్కుంటారని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అలాగే గ్రామాల్లో సారా, మద్యం విక్రయాలు, గంజాయి రవాణా గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ దివ్య కోరారు.

రూ.1500 కోట్ల రుణాలు లక్ష్యం

» డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ

» వచ్చే నెల నుంచి పీఏసీఎస్‌లలో ఆన్‌లైన్ సేవలు



డీసీసీబీ బ్రాంచ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఈవో వర్మ

నర్సీపట్నం, సెప్టెంబరు 20 : ఈ ఆర్థిక సంవత్సరంలో డీసీసీబీ ద్వారా రూ.1500 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సీఈవో డీవీఎస్ వర్మ తెలిపారు. స్థానిక రామారావుపేటలోని పీఏసీఎస్ భవనంలోకి డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయాన్ని తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో లీజ్ అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ చేయించడానికి శుక్రవారం నర్సీపట్నం వచ్చిన ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 30 డీసీసీబీ బ్రాంచ్‌లున్నాయన్నారు. త్వరలో పద్మనాభంలో మరొకటి ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డీసీసీబీకి రూ.1.60 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. మొత్తంగా రూ.2,250 కోట్లు ఆర్థిక లావాదేవీలు జరిగాయని, అందులో రూ.947 డిపాజిట్లు, రూ.1,320 కోట్లు రుణాలుఉన్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2,600 కోట్లకు వ్యాపారాన్ని పెంచాలని, రూ.1500 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. సహకార సంఘాలలో రికార్డులు కంప్యూటీకరణ వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. అక్టోబరు 2 నాటికి పూర్తి చేసి పీఏసీఎస్‌లలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద అనకాపల్లి జిల్లాలో దివిలి, సుబ్బవరం, విశాఖ జిల్లాలోని పెందుర్తి, ఆనందపురం, ఏఎస్ఆర్ జిల్లా పాడేరు సహకార సంఘాల రికార్డులు కంప్యూటరీకరణ చేశామని తెలిపారు.

దేవితల్లి ఆలయంలో మకరతోరణం, స్టీల్‌గేట్లు ఏర్పాటు



దేవితల్లికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల, సెప్టెంబరు 20 : స్థానిక దేవితల్లి ఆలయంలో విరాళ దాతలు ఇచ్చిన ఆర్థిక సహాయంతో మకరతోరణం, స్టీల్‌గేట్లును ఏర్పాటుచేశారు. వాటి ప్రారంభం సందర్భంగా శుక్రవారం స్థానిక దేవి ఆలయంలో పురోహితులు వాసు ప్రత్యేక కుంకుమపూజలు, అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన మకరతోరణానికి జవ్వాది వరహాలు, వెంకటలక్ష్మి దంపతులు లక్ష రూపాయలు విరాళం అందించగా, స్టీల్ గేట్లుకు సంబంధించి ఉగ్గిన వెంకటరావు, వెంకటలక్ష్మి దంపతులు, అలాగే కశింకోట పైడికొండలరావు దంపతులు కలిసి రూ.1.10 లక్షలు విరాళంగా అందించారు. అలాగే అమ్మవారికి రంగులు వేసేందుకుగాను కోన చిన్నారావు దంపతులు రూ.25 వేలు విరాళంగా అందించారు. దీంతో మకరతోరణం, గేట్లు ఏర్పాటుతోపాటు రంగులతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ చేశారు. వీటి ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించిన విరాళదాతలను మోటార్ ఆటో సివిల్, ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సాలువాలుకప్పి ఘనంగా సత్కరించారు.

ఇది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం

ఘనంగా 'మాది మంచి ప్రభుత్వం' ప్రారంభం

చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

రోలుగుంట, సెప్టెంబరు 20 : ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమం అందించి మొదటి 100 రోజుల్లోనే 'ఇది మంచి ప్రభుత్వం' అని అనిపించుకున్న ప్రభుత్వం తమదని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. శుక్రవారం రోలుగుంట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికిఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా పని చేస్తుందన్నారు. మెగా డీఎస్సీలో 16437 ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేపట్టడం, ఫించన్లను ఒకేసారి రూ.1000 పెంచి రూ.4వేల చొప్పున ఇవ్వడం జరిగిందన్నారు. పెంచిన మొదటి నెల ఒక్కొక్కరికీ రూ.7వేల చొప్పున ఒకే రోజు 65.18 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ.4.408 కోట్లు పంపిణీ చేయడం దేశంలోనే తిరుగులేని సంక్షేమ చరిత్ర సృష్టించామన్నారు. పేదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం రూ.5లకే ఆకలి తీర్చే 75 అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించామన్నారు. ప్రతీ నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ కార్యక్రమంలో భాగంగా దీపావళి నుంచి మొదటి గ్యాస్ సిలెండర్ కూడా అందించడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అనంతరం రోలుగుంటలో ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమణమూర్తి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, టీడీపీ నాయకులు సుర్ల రామకృష్ణ, బంటు చిరంజీవి, కోలిపల్లి ఈశ్వరరావు, సబ్బవరపు పెద్దినాయుడు, పిట్ల బుల్లిబాబు, లగుడు సత్తిబాబు, సుర్ల బాబులునాయుడు పాల్గొన్నారు.

గ్రామగ్రామానా 'ఇది మంచి ప్రభుత్వం'

» పండగలా నిర్వహించిన కూటమి నేతలు, అధికారులు

» కరపత్రాలు పంపిణీ, స్టిక్కర్ల అతికింపు



నర్సీపట్నం : 26వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో చింతకాయల పద్మావతి



గొలుగొండ : జోగంపేటలో కరపత్రాలు అందిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

నర్సీపట్నం, సెప్టెంబరు 20 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా వాడవాడలా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపాలిటీ 26వ వార్డులో చింతకాయల పద్మావతి, మండలంలో దుగ్గాడ గ్రామంలో జెడ్పీటీసీ సుకల రమణమ్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు గడప గడపకు తిరిగి స్టిక్కర్లు అతికించారు.

బుచ్చెయ్యపేట : మండలంలో కూటమి నేతలు 'ఇది మంచి ప్రభుత్వ' కార్యక్రమాన్ని ఉత్సాహంగా చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించారు. ఈ వంద రోజుల్లో చేపట్టిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొండా నరేష్, గోకివాడ కోటేశ్వరరావు, తమరాన దాసు, దాడి సూర్యనాగేశ్వరరావు, దొండా సన్యాసిరావు, సాయం శేషు, దొండా శ్రీను, డొంకిన అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు, ఎం.తాతయ్యలు, దేవర అప్పారావు, దొండా గిరిబాబు, వడ్డాది పంచాయతీ ఈవో లవరాజు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన పనులు, సంక్షేమ పథకాలు పంపిణీని వివరించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు గొంప వాసు, బొడ్డు జమీలు, కొలగాని రామారావు, మువ్వల బుజ్జి, బొప్పన ప్రసాద్, రమణ, ప్రభాకర్, గెడ్డం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : పలు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వంపై మండలస్థాయి అధికారులు, కూటమి పార్టీల నాయకులు శుక్రవారం కరపత్రాలు పంచారు. మండలంలోని జోగంపేట, రావణాపల్లి, గొలుగొండ, కొత్తఎల్లవరం, పాకలపాడు, చీడిగుమ్మల, గుండుపాల, పాతమల్లంపేట, పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం గ్రామాల్లో పర్యటించి ప్రజలకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డేవిడ్‌రాజ్, మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పనాయుడు, నాయకులు సుర్ల బాబ్జి, బీమిరెడ్డి సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద్, కొల్లి రాంబాబు, కొల్లాన కొండలరావు, గెడ్డం ఆనంద్, రఘురాం పాల్గొన్నారు.

నాతవరం : మండలంలోని వెన్నలపాలెంలో మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, ఎంపీడీవో హనుమంతరావు, జనసేన నాయకులు వీరసూర్యచంద్రలు పాల్గొని 100 రోజులలో ప్రభుత్వ కార్యక్రమాలు వివరిస్తూ ఇంటింటికి స్టిక్కర్లు అంతికిం చారు. మాజీ ఎంపీపీ లు ఎన్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలో పలు గ్రామాల్లో ఇంటింటికి మంచి ప్రభుత్వం స్టిక్కర్లను పంపిణీ చేస్తున్నారు. బూరుగుపాలెంలో కేటిరెడ్డి చిరంజీవి, జి.కోడూరులో జయరాం, భోమబోయినపాలెంలో నందకిషోర్, రాచపల్లి జోగిపాత్రుడు, శెట్టిపాలెం గ్రామంలో టీడీపీ మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లు రామునాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

రావికమతం : మండలంలోని గుడిప గ్రామంలో శుక్రవారంఎంపీటీసీ గంజి సూర్యానారాయణ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. గత వందల రోజుల పాటు అందించిన పథకాలు, చేసిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి అప్పారావు, గల్లా నానిబాబు, పెద్దాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్, ఎంపీడీవో చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కార్యదర్శి అప్పారావు, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ కృష్ణమూర్తి ప్రతి ఇంటికి వెళ్లి బ్రోచర్లు అందజేశారు.

చీడికాడ : మండలంలోని అన్ని గ్రామాల్లో కరపత్రాలను పంచాయతీ అధికారులు, టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. బి.సింగవరంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షులు శరగడం శివతో పాటు పలువురు మహిళలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న పథకాలను వివరించారు.

మండల సమావేశంలో ప్రొటోకాల్‌పై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు, సెప్టెంబరు 20 : గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు సమాచారం ఆహ్వానమిచ్చి వారి భాగస్వామ్యంతో ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయాలని మండల స్థాయి అధికారులను ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇటీవల ఆర్లి సెజ్ నిమిత్తం భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటనలో ఎంపీపీ సభ్యుడు అయిన రెడ్డి జగన్‌మోహన్‌కు ఎందుకు సమాచారం ఇవ్వలేదని చౌడువాడ ఎంపీటీసీ సభ్యుడు రాజేష్ డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీవోలను అడిగారు. దీనికి స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ ఆర్లిలో కలెక్టర్ సందర్శన కార్యక్రమం ముందు రోజు రాత్రి సుమారు ఏడున్నర గంటల వరకు ఖరారు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో సమయాభావంతో పాటు పనుల్లో నిమగ్నమై ఎంపీపీకి సమాచారం ఇవ్వలేకపోయాం తప్ప ఉద్దేశపూర్వకంగా కాదని తెలిపారు. ఇకపై ప్రొటోకాల్ పాటించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటామని ఎంపీడీవో అప్పలరాజు చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వడం మర్చిపోవద్దని మండల స్థాయి అధికారులకు ఎంపీడీవో ఆదేశించారు. రీ సర్వే డేటాపై చౌడువాడ ఎంపీటీసీ సభ్యుడు రాజేష్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌బాబును, ఈ క్రాప్ నమోదుపై సూదివలస ఎంపీటీసీ సభ్యులు వర్రి రామునాయుడు, అగ్రికల్చర్ ఆఫీసర్ సోమశేఖర్‌ను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో మండలంలో ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కూళ్లలో ఉత్సాహంగా క్రీడా పోటీలు



నర్సీపట్నం : విద్యార్థినులతో కలిసి కబడ్డీ ఆడుతున్న జెడ్పీటీసీ రమణమ్మ



చీడికాడ : క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు


నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 20 : వేములపూడిలో మండల స్థాయి క్రీడా పోటీలను జెడ్పీటీసీ సుకల రమణమ్మ ప్రారంభించారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీనియర్, జూనియర్ విభాగాలలో బాలబాలికలు ఆటల పోటీలలో పాల్గొన్నారు. జెడ్పీటీసీ రమణమ్మ విద్యార్థినులతో కబడ్డీ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 నాగేంద్ర, ఎంపీటీసీ బోళెం రాంప్రసాద్, హెచ్ఎం రమణ, మండల స్పోర్ట్ కో-ఆర్డినేటర్ రవిపాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : ప్రాథమిక దశ నుంచి చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలని గొలుగొండ జడ్పీటీసీ ఎస్.వెంకట గిరిబాబు అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్ స్కూల్ గ్రేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఎంఈవో సత్యనారాయణ, స్థానిక సర్పం చ్ లోచల సుజాతలతో కలిసి ఆయన ఈ పోటీలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలకు మండలవ్యాప్తంగా 170 మంది విద్యార్థులు పాల్గొని అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ తదితర పోటీలు పాల్గొంటారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ లగుడు రాజులు నాయుడు, ఎంపీటీసీలు చింతల బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ, సర్పంచ్ లోచల సుజాత, హెచ్ఎం నాగభూషణం, మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడ : ప్రతి విద్యార్థికి విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. మండలంలోని చుక్కపల్లి హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడాపోటీలను శుక్రవారం ఎంపీపీ కురచా జయమ్మ, స్థానిక సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎంఈవో బీవీ రమణ మాట్లాడుతూ మండలంలో11 ఉన్నత, రెండు యూపీ పాఠశాలల నుంచి 350 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని అన్నారు.ఈ క్రీడా పోటీల్లో గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, పీఈటీలు పాల్గొన్నారు.

దేవరాపల్లి : క్రీడా పోటీలతో పిల్లల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలు బయట పడతాయని ఎంపీపీ చింతలబుల్లి లక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు శుక్రవారం నిర్వహించారు. పోటీలను ఎంపీపీ బుల్లి.లక్ష్మి, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ కృష్ణమూర్తి ఎంఈవో పడాల్ దాస్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహద పడతాయని మాకవరపాలెం ఎంపీపీ రుత్తల లక్ష్మి అన్నారు. మండలంలో జి.కోడూరు హైస్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు వ్యాయమ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



దేవరాపల్లి : క్రీడలు ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మి



రైతు బేజార్

... 5వ పేజీ తరువాయి

ఏర్పడడంతో దుకాణాలన్నీ అంధ్రాబ్యాంకు రోడ్డు, ప్రేమసమాజం రోడ్డులోకి మళ్లించారు. అప్పటి నుంచి రోజూ ఈ రోడ్డుపైనే రైతులు, వ్యాపారులు కూరగాయలు విక్రయించుకుంటున్నారు. ఎండైనా.. వాన అయినా రైతులు నడిరోడ్డుపైనే కష్టాలు పడుతున్నారు. రైతు బజారు పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని ఇటు రైతులు, అటు చిరువ్యాపారులు ఎదురుచూస్తున్నా, ఇప్పటికీ వారి కష్టాలు తీరేదారి మాత్రం కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వంఅధికారంలోకి రావడం, ఎమ్మెల్యే రాజు మళ్లీ ప్రజాప్రతినిధిగా ఎన్నిక కావడంతో తమ కష్టాలు ఇకనైనా తీరుతాయన్న ఆశాభావంతో ఉన్నారు.

రైతు బజారు పూర్తి చేయడమే లక్ష్యం

- కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్యే, చోడవరం

చోడవరంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు బజారును పూర్తిచేయడం నా లక్ష్యం. రైతు బజారు నిర్మాణాల పూర్తికి అవసరమైన నిధులు తీసుకు వస్తాను. దీనిని పూర్తి చేసి రైతులు, చిరువ్యాపారుల ఇక్కట్లు తీరుస్తాం.

రావికమతంలో వర్షం

రావికమతం, సెప్టెంబరు 20 : మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వేసవిని తలపించేలా ఎండలు ఉండడంతో జనం ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు మెట్ట ప్రాంతాల్లోని పొలాల్లో తడి ఆరింది. దీంతో నేలపై బీటలు వచ్చాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం పడిన వర్షం భారీ ఊరట ఇచ్చిందని రైతాంగం అంటోంది.

భీమిలి ఆర్డీవో బరితెగింపు!

... 5వ పేజీ తరువాయి

వచ్చింది. సాధారణంగా తన వద్దకు భూముల ఫైలు వస్తే వెంటనే సదరు భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం విశ్వనాథన్‌కు అలవాటు. ఆయన స్వయంగా మధురవాడలో సర్వే నంబరు 133లో గల భూమిని పరిశీలించి హౌసింగ్ బోర్డుకు కేటాయించినదిగా గుర్తించారు. అయినా ప్రైవేటు వ్యక్తికి చెందిన భూమిగా పేర్కొంటూ ఫైలు పంపడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించి ఆర్డీవో, అప్పటి విశాఖ రూరల్ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోపై చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేశారు. తరువాత కొద్ది నెలలకు జేసీని ప్రభుత్వం బదిలీ చేయడం, ఈలోగా ఎన్నికలు రావడంతో భూమి వ్యవహారం తెర మరుగైంది.

ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్వే నంబరు 133లో గల భూ వ్యవహారంపై దృష్టిసారించింది. అక్రమాలు జరిగినట్టు గుర్తించి ఆర్డీవో భాస్కర్‌రెడ్డితో పాటు ఆర్ఐ మల్లేశ్వరరావు, గ్రేడ్-2 వీఆర్వో దుర్గాప్రసాద్‌పై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. తహసీల్దారు రమణయ్య అప్పటికే హత్యకు గురికావడంతో ఆయన పేరు ప్రస్తావించలేదు. తహసీల్దారుగా ఉన్నప్పుడు సర్వే నంబరు 133లో భూమిని హౌసింగ్ బోర్డుకు అప్పగించిన భాస్కరరెడ్డి, అదే ఆర్డీవో అయిన తరువాత అదే భూమిలో 3.47 ఎకరాలు ప్రైవేటు వ్యక్తికి అప్పగించేలా ఫైలు పంపడం పరిశీలిస్తే అక్రమాలకు ఏ విధంగా సహకరించారో అర్థమవుతుందని రెవెన్యూలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇదిలావుండగా ఓట్ల లెక్కింపు అనంతరం సెలవుపై విదేశాలకు వెళ్లిన భాస్కర్‌రెడ్డి ఇటీవల తిరిగి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే హౌసింగ్ బోర్డు భూమి వివాదంలో ఆయనపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన ఫైలు సిద్ధమైంది. అయినా ఆయన ఆర్డీవోగా తిరిగి బాధ్యతలు స్వీకరించేందుకు ప్రభుత్వం అనుమతించడం ఆశ్చర్యకరం.

☛ సంక్షిప్తంగా..

రెండో రోజూ కొనసాగిన ధర్నా

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 20 : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో స్థానికేతురుడుని షిఫ్ట్ ఆపరేటర్‌గా నియమించడాన్ని నిరసిస్తూ ఆర్.భీమవరం, నీలకంఠాపురం గ్రామస్తులు రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రెండో రోజైన శుక్రవారం కూడా ధర్నా కొనసాగించారు. గతంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఆర్.భీమవరానికి చెందిన రొంగలి నర్సింగరావు కటుంబ సభ్యులకు షిఫ్ట్ ఆపరేటర్‌గా నియమించాలని నర్సింగరావు భార్య రామలక్ష్మి చేపట్టిన ధర్నాకు రెండు గ్రామాలకు చెందిన ప్రజలు సంఘీభావం ప్రకటించిన విషయం విదితమే. ఈ ధర్నాలో మాజీ సర్పంచ్‌లు మలిరెడ్డి బాబ్జి, కె.సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెలంకాయల అప్పలనాయుడు, రొంగలి చిన్నంనాయుడు తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

మండల యాదవ సంక్షేమ సంఘాధ్యక్షుడుగా రమేష్

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 20 : మండల యాదవ సంక్షేమ సంఘాధ్యక్షుడుగా వడ్డాదికి చెందిన సింగంపల్లి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం బుచ్చెయ్యపేటలో జరిగిన యాదవ సంక్షేమ సంఘం సర్వసభ్యసమావేశం ఉపాధ్యక్షుడుగా వియ్యపు రాజు, కార్యదర్శిగా వియ్యపు రామారావు, గౌరవ అధ్యక్షుడుగా గుద్దేటి పోతురాజు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైన రమేష్‌ను జిల్లా యాదవ సంక్షేమ సంఘాధ్యక్షుడు బర్నికాన సాయినాథరావు, నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, జోగా కొండబాబు, దేవర అప్పారావు తదితరులు శాలువ కప్పి, పూలమాల వేసి అభినందించారు.

'ఉపాధి' వీఆర్పీపై విచారణ

రావికమతం, సెప్టెంబరు 20 : ఉపాధి హామీ పథకం అమలులో అవకతవకలకు పాల్పడిన దొండపూడి వీఆర్పీ (ఫీల్డ్ అసిస్టెంట్) సీహెచ్ కుమారిని వెంటనే విధుల నుంచి తప్పించాలని కోరుతూ గ్రామస్థులు విచారణాధికారిని డిమాండ్ చేశారు. తమ కుటుంబ సభ్యులైన పసుపులేటి మహేశ్వరరావు, సిరిసాల దేముడు, పొలుమూరి అప్పలసుందరమ్మ, పొలుమూరిశ్రీను తదితరులు పనుల్లో పాల్గొకుండానే వీఆర్పీ మస్తర్లు వేశారంటూ కొందరు చేసిన ఫిర్యాదుపై శుక్రవారం ఉపాధి హామీ పథకం ఏపీవో కాశీ గ్రామంలో బహిరంగ విచారణ నిర్వహించారు. దీంతో కుమారి అవకతవకలకు పాల్పడినట్టు తేలింది. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్టు ఏపీవో తెలిపారు

వేతనాలు పెంచకుంటే సమ్మెబాట

» విశాఖ డెయిరీ యాజమాన్యానికి పాల సంఘాల కార్యదర్శుల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

తుమ్మపాల, సెప్టెంబరు 20 : వేతనాలు పెంచకుంటే సమ్మెకు వెనుకాడమని విశాఖ డెయిరీ యాజమాన్యానికి పాల సంఘాల కార్యదర్శులు హెచ్చరించారు. అనకాపల్లి పట్టణ పరిధి గవరపాలెంలో శుక్రవారం ఉత్తరాంధ్ర జిల్లాల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ పాల కేంద్రాల కార్యదర్శుల అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ మాట్లాడుతూ తమ సహకార సంఘాల ద్వారా పాలను సేకరించి విజయ విశాఖ డెయిరీకి పంపుతూ సంస్థ లాభాల బాటలో నడిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాల సంఘాల కార్యదర్శులు, వర్కర్లకు ఐదేళ్లుగా జీతాలు పెంచకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. జోనల్ ఆఫీసుల వద్ద దశల వారీగా ఆందోళనలు చేసి, పరిష్కారం కాకుంటే అంతిమంగా సమ్మెకు సిద్ధపడాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, దొడ్డి సూర్యారావు, జి.కనకారావు, కరక సోమునాయుడు, శ్రీకాకుళం నుంచి ప్రసాద్, విజయనగరం జిల్లా నుంచి జామి అప్పలనాయుడు, సన్యాసినాయుడు, రవి, లక్ష్మణరావు, తూర్పుగోదావరి జిల్లా నుంచి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'ఇది మంచి ప్రభుత్వం'

... 5వ పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి వార్డులో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం మేడిచర్ల గ్రామంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ విజయకృష్ణన్ హాజరై 'ఇది మంచి ప్రభుత్వం' బ్రోచర్‌ను మహిళలకు పంపిణీ చేశారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డు లో, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ దుగ్గాడ గ్రామంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పోస్టింగుల కోసం పైరవీలు

... 5వ పేజీ తరువాయి

బదిలీల కోసం దరఖాస్తులు చేసుకొని కావలసిన చోటు కోసం ఎమ్మెల్యేల లేఖలతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కువ మంది ఉద్యోగులు ఏజెన్సీలో పోస్టింగులు పడకుండా మైదాన ప్రాంత మండలాల్లో పోస్టింగుల కోసం ఆప్షన్లు పెట్టుకున్నట్టు తెలుస్తోంది.చాలామంది ఉద్యోగులు జిల్లాల పునర్విభజన తరువాత అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లాల్లో పనిచేస్తున్నా, ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రం నుంచే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఎక్కువ మంది తిరిగి విశాఖ జిల్లాలో మండలాలకు బదిలీపై వెళ్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితి ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, సచివా లయాలు, ల్యాండ్స్, సర్వే శాఖల్లోనే ఎక్కువగా ఉంది. రెవెన్యూ శాఖలో కొందరు ఉద్యోగులైతే ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ పోస్టింగుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో పనిచేసి వచ్చిన తమకు మళ్లీ ఏజెన్సీ ప్రాంతాలకు పంపేందుకు కుట్ర జరుగుతోందని పలువురు సర్వేయర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. బదిలీలను పారదర్శకంగా చేసి న్యాయంచేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.